## పున్నేల్‌లో ఉచిత సంచార వైద్య శిబిరం

ఐనవోలు, నవంబర్ 4: మండలంలోని పున్నేల్‌లో ఉచిత సంచార వైద్య శిబిరం నిర్వహించినట్లు రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ పెద్ద వెంకటనారాయణగౌడ్ తెలిపారు. గ్రామంలో శనివారం హనుమకొండ రెడ్‌క్రాస్ మొబైల్ మెడికల్ యూనిట్ ఆధ్వర్యంలో వృద్ధులకు ఆరోగ్య శిబిరంలో వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసెబిలిటీస్, సీనియర్ సిటిజన్స్, భారత ప్రభుత్వ సహకారంతో వయో వృద్ధులకు ఇంటి వద్దే హనుమకొండ రెడ్ క్రాస్ సంచార వైద్యశాల సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెల రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచితంగా బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి, నెలకు సరిపడా మందులు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ డాక్టర్లు జీ కిషన్‌రావు, టీ మదన్‌మోహన్‌రావు, సిబ్బంది గుల్లెపల్లి శివకుమార్, గంగాధర్, పవన్, రమేశ్, పోశాలు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ వైద్యులు



గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్

# బీఆర్ఎస్‌లో చేరికల వెల్లువ

నయీంనగర్, నవంబర్ 4: బీఆర్ఎస్ పార్టీలోకి చేరికల పరంపర కొనసాగుతోంది. శనివారం గ్రేటర్ వరంగల్ 1వ డివిజన్ ముచ్చర్ల గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని తన నివాసంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్ గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి అనేక మంది బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. కార్యకర్తలను కంటికిరెప్పలా కాపాడుకుంటానని, ఐక్యంగా పనిచేసి బీఆర్ఎస్ గెలుపు కోసం పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నరెడ్ల శ్రీధర్, మార్కెట్ డైరెక్టర్ విజయ్, నాయకులు వెంకట్, అనిల్ పాల్గొన్నారు.

## చింతగట్టు సబ్‌స్టేషన్‌లో విద్యుత్ అంతరాయం

హసన్‌పర్తి, నవంబర్ 4: చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏఈ ప్రదీప్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ నుంచి గ్రామాలకు వెళ్లే విద్యుత్ లైన్స్, పోల్స్ మరమ్మతులు చేస్తున్నందున సబ్‌స్టేషన్ పరిధిలోని దేవన్నపేట, మధు తండా, ఆహ్ల్యతండా, కోమటిపల్లి, సుబ్బయ్యపల్లిలో ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

## విద్యార్థి అరెస్ట్

హసన్‌పర్తి, నవంబర్ 4: హనుమకొండ జిల్లాలోని ఓ ప్రైవేట్ యూనివర్సిటీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ముంబై పోలీసులు శనివారం తెల్లవారుజామున 4 గంటలకు అరెస్ట్ చేశారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన అతడితో పాటు పలువురు ముంబైకి చెందిన ప్రముఖ వ్యాపారవేత్తను బెదిరించి కోట్లాది రూపాయలు డిమాండ్ చేయగా బాధితుడి ఫిర్యాదు మేరకు అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈమేరకు నిందితుడైన విద్యార్థిని అరెస్ట్ చేసి ముంబైకి తరలించారు.

## సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించాలి

నర్సంపేట రూరల్, నవంబర్ 4: విద్యార్థులు సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించాలని రిసోర్స్ పర్సన్ వెంకటేశ్వర్లు, బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ ఎ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం లక్నెపల్లి శివారు బాలాజీ ఇంజినీరింగ్ కళాశాలలో జావా టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన సదస్సులో మాట్లాడారు. బిట్స్ ప్రిన్సిపాల్స్ హరిహరన్, డీన్ విక్రంరెడ్డి, సెక్రటరీ రాజేశ్వర్‌రెడ్డి, ఏవో సతేంద్రసురేష్, నారాయణ, కృష్ణ, విజయ్ రెడ్డి, శ్రీధర్, రజియాబేగం ఉన్నారు.

# జోరుగా బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం

వర్ధన్నపేట, నవంబర్ 4: బీఆర్ఎస్ పార్టీ వర్ధన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్ గెలుపు కోరుతూ మండల వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మండలంలోని చెన్నారంలో ఎంపీపీ అన్నమనేని అప్పారావు, వర్ధన్నపేట పట్టణంలో మాజీ జడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణి, ఇతర పార్టీ ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో శనివారం విస్తృతంగా ప్రచారం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. పల్లెలు, పట్టణాలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏవిధంగా అభివృద్ధి జరిగాయనేది ప్రజలకు తెలియజేశారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే అరూరి రమేశ్ చేసిన అభివృద్ధిని వివరించారు. ప్రధానంగా గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతులను మెరుగు పరచడంతోపాటుగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ప్రజలకు చెప్పారు. వర్ధన్నపేట బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ గుజ్జ గోపాల్‌రావు, చెన్నారం సర్పంచ్ భాస్కర్‌రావు, పట్టణ ప్రముఖులు వెంకటేశ్వర్‌రావు, తిరుపతి సురేష్, బొంత కాంతం పాల్గొన్నారు.

### మునిపల్లిలో..

హసన్‌పర్తి: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్ గెలుపు కోసం శనివారం గ్రేటర్ 65 డివిజన్ పరిధి మునిపల్లిలో ఇంటింటా ప్రచారం చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి అరూరి రమేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అభివృద్ధి చేసే నాయకుడు అరూరిని గెలుపించుకుంటే ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందుతాయని అన్నారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు నద్దునూరి కరుణాకర్, ఆత్మ డైరెక్టర్ మ్యాదెర దేవేంద్ర, నాయకులు వేల్పుల నారాయణ, మహిళలు, నాయకులు పాల్గొన్నారు.



వర్ధన్నపేట: వర్ధన్నపేటలో ప్రచారం చేస్తున్న మాజీ జడ్పీటీసీ సారంగపాణి, బీఆర్ఎస్ నాయకులు



చెన్నారంలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ అప్పారావు



హసన్‌పర్తి: మునిపల్లిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

## రామప్పలో పర్యాటకుల సందడి

వెంకటాపూర్, నవంబర్ 4 : మండలంలోని రామప్ప దేవాలయం శనివారం పర్యాటకులు, విద్యార్థులు, భక్తులతో సందడిగా మారింది. వివిధ రాష్ట్రాల నుంచి పర్యాటకులు పెద్దసంఖ్యలో సందర్శించారు. ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ పూజలు చేసి తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్స్ వివరించారు. ఆలయంలో ఉత్సాహంగా కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఫొటోలు, సెల్ఫీలు దిగారు. అనంతరం రామప్ప సరస్సులో బోటింగ్ చేసి ఆహ్లాదంగా గడిపారు.

# ఝాన్సీరెడ్డి ఔట్.. యశస్వినీరెడ్డి డౌట్

- స్థానికంగా లేరని ఎన్నికల కమిషన్‌కు పలువురు ఫిర్యాదు
- పాలకుర్తి కాంగ్రెస్‌లో మరో ట్విస్ట్

దేవరుప్పుల, నవంబర్ 4: మూడు నెలలుగా తానే కాంగ్రెస్ అభ్యర్థినని ఊదరకొడుతూ పాలకుర్తి నియోజకవర్గంలో పర్యటించిన అనుమాండ్ల ఝాన్సీరెడ్డికి భారతదేశ పౌరసత్వం లభించలేదు. దీంతో ఆమె ఎన్నికల బరి నుంచి తప్పుకుని ఆమె కోడలు యశస్వినీరెడ్డిని బరిలో దింపి కోరి మరో తలనొప్పిని తెచ్చుకుంది. కాంగ్రెస్ అభ్యర్థిగా యశస్వినీరెడ్డిని అధిష్టానం ప్రకటించినా ఆమె ఓటు విషయంలో సాంకేతిక సమస్యలు వచ్చాయి. పోటీ చేయాలంటే ఓటు హక్కు ఉన్న ప్రాంతంలో వరుసగా 180 రోజులు స్థిర నివాసం ఉండాలనే నిబంధనను ఆమె ఉల్లంఘించారని ఓ అడ్వకేట్, మరో స్వచ్ఛంద సంస్థ సభ్యుడు కేంద్ర, రాష్ట్ర ఎన్నికల అధికారులకు, సంబంధిత జిల్లా అధికారులకు లేఖ రాశారు. సదరు అభ్యర్థికి లీగల్ నోటీసులు ఇచ్చారు. అసలే రాజకీయాలు కొత్త. మరోవైపు విదేశీయురాలు. పాలకుర్తి నియోజకవర్గంలో బరిలో ఉండాలని ఉత్సాహపడిన ఝాన్సీరెడ్డి, ఆమె కుటుంబం కాంగ్రెస్ పార్టీకి గుదిబండగా మారారు. ఓటమి ఎరుగని నాయకుడు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. ఆయన్ను ఎన్నికల్లో ఢీకొనాలంటే రాజకీయ చతురత, అనుభవం, పరిజ్ఞానం ఉండాలి. వీటిని పట్టించుకోని కాంగ్రెస్ హైకమాండ్ వారిద్దరికీ కాంగ్రెస్ అభ్యర్థిత్వం ఇవ్వాలని భావించినా స్థానిక ఆ పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది. ఝాన్సీరెడ్డికి దేశ పౌరసత్వం రాక అభ్యర్థిత్వం కోల్పోగా, యశస్వినీరెడ్డి టికెట్ సాధించినా మరో వివాదంలో చిక్కుకోవడంతో కాంగ్రెస్ శ్రేణులు నిరుత్సాహానికి గురవుతున్నారు. యశస్వినీరెడ్డికి పుట్టిన చోటుతోపాటు హైదరాబాద్‌లోనూ ఓటుహక్కు ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం అభ్యర్థి కోసం వెతకడం ప్రారంభించినట్లు సమాచారం.

# పద్మాక్షి గుండంలో వ్యర్థాలను తొలగించాలి

హనుమకొండ, నవంబర్ 4 : హనుమకొండ పద్మాక్షికాలనీలోని పద్మాక్షి గుండంలో పేరుకుపోయిన వ్యర్థాలను తక్షణమే తొలగించాలని పద్మాక్షి గుండం కట్ట వాకర్స్ అసోసియేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. శనివారం గుండం వద్ద అసోసియేషన్ అధ్యక్షుడు అంబటి కుమారస్వామి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ నగరంలో ఆవాసాల మధ్యలో ఉన్న పద్మాక్షి గుండంలో రకరకాల పీవోపీ విగ్రహాలు తేలి, పాలిథిన్ కవర్లు, బతుకమ్మలతో కుళ్లిపోయి దుర్వాసన వస్తోందని పేర్కొన్నారు. దీంతో రోజూ ఆలయానికి వచ్చే భక్తులు, వాకర్స్ ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా గ్రేటర్ కమిషనర్ స్పందించి, ప్రజారోగ్య భద్రత దృష్ట్యా వెంటనే పద్మాక్షి గుండంలోని కలుషిత వ్యర్థాలను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు ఆకుల దుర్గయ్య, నల్లెల్ల రాజయ్య, పెట్టెం గంగాధర్, దొమ్మటి రాజేశ్వర్, సుతారి సోమేశ్వర్, కొండ రవి, సురేష్, పైడి మర్రి రాంప్రసాద్, సుధాకర్, గుంజి సుబ్బారావు పాల్గొన్నారు.



పద్మాక్షి గుండం వద్ద నిరసన తెలుపుతున్న పద్మాక్షి గుండం కట్ట వాకర్స్ అసోసియేషన్ నాయకులు